




సీఎం జగన్ రెండుసార్లు టెంకాయలు కొట్టినా.. స్టీలు ఫ్యాక్టరీ శిలాఫలకాలకే పరిమితం

మీరు దేనికి సిద్ధం..?

అవినీతిని ప్రశ్నించిన చేనేత వర్గానికి చెందిన బీసీ నేత నందం సుబ్బయ్యను.. పట్టపగలు అధికారుల సాక్షిగా హత్య చేశారు..

తమ భూమిని వైసీపీ నేతలు ఆన్‌లైన్‌లోకి ఎక్కించుకోవడంతో... గత్యంతరం లేక మాధవరంలో చేనేత కుటుంబంలో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు..

మీరు దేనికి సిద్ధం.. హత్యలు చేసేందుకా.. ఆస్తులు లాక్కునేందుకా?

అధికారం చేపట్టిన ఆరునెల్లో ఉక్కు ఫ్యాక్టరీకి టెంకాయ కొట్టి.. మూడేళ్లలో పూర్తి చేస్తామని ఇదీ మా చిత్తశుద్ధి అన్నారు. నాలుగేళ్లయినా శిలాఫలకాలకే పరిమితం అయింది..

మీరు దేనికి సిద్ధం.. నిరుద్యోగులను దగా చేసేందుకా..?

ఒక్క నీటి ప్రాజెక్టు పూర్తి కాలేదు.. భయంకరమైన కరువుతో జిల్లా అంతటా జనం అల్లాడిపోతున్నా.. ఒక్క మండలాన్నీ కరువు జాబితాలో చేర్చలేదు.. డ్రాట్ యాక్షన్ ప్లాన్‌కు రెండు నెలలుగా ఒక్కరూపాయీ విదిల్చలేదు..

మీరు దేనికి సిద్ధం.. ఎండిన పంటలు చూసి చిక్కటి చిరునవ్వులు చిందించడానికా..?

బుధవారం ప్రొద్దుటూరులో సీఎం జగన్ ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తుండటంతో జిల్లా ప్రజలు సంధిస్తున్న ప్రశ్నిలివి..



- ఉక్కు కర్మాగారం నిర్మించనందుకా ?
- రూ.2వేల కోట్లతో ప్రొద్దుటూరు అభివృద్ధి అంటూ మోసం చేసినందుకా
- అవినీతి అక్రమాలను ప్రశ్నించినందుకు బీసీ నేత నందం సుబ్బయ్యను హత్య చేసినందుకా..
- పాలఫ్యాక్టరీ నిర్మిస్తామని చెప్పి మాట తప్పినందుకా
- ప్రొద్దుటూరును భూ మాఫియా అడ్డాగా చేసినందుకా
- వైసీపీని ప్రశ్నిస్తున్న జిల్లా వాసులు
- నేడు ప్రొద్దుటూరులో 'మేం సిద్ధం' పేరిట జగన్ సభ

(కడప-ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత, సీఎం జగన్ రాష్ట్రవ్యాప్త ఎన్నికల ప్రచారాన్ని సొంత జిల్లా నుంచే ప్రారంభిస్తున్నారు. మేం సిద్ధం.. అంటూ ప్రొద్దుటూరు పట్టణంలో బుధవారం బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఒక్క చాన్స్ పేరిట 2019 ఎన్నికల్లో కడప జిల్లా సమగ్రాభివృద్ధికి జగన్ లెక్కలేనన్ని హామీలిచ్చారు. పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు.. ప్రాజెక్టులు పూర్తిచేసి రైతుల పొలాలకు నీళ్లు.. మూతబడ్డ పాల పరిశ్రమను తెరిచి పాడి రైతులను ఆదుకోవడంతో పాటు జిల్లాను అభివృద్ధి చేస్తామంటూ 70 ఎంఎంలో సినిమా చూపించారు. సీఎం మనోడైతే అభివృద్ధికి లోటుండదనుకుని నమ్మకంతో జనం అప్పటి ఉమ్మడి జిల్లాలో 10కి 10 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలు కట్టబెట్టారు.

సీన్ కట్ చేస్తే.. ఐదేళ్లలో ఇచ్చిన హామీలకు చేసిన అభివృద్ధికి నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది. అభివృద్ధిని కేవలం పులివెందులకే పరిమితి చేశారు తప్ప జిల్లా కేంద్రమైన కడపకు కానీ, రెండో ముంబై అయిన ప్రొద్దుటూరుకు కానీ.. వెనుకబడ్డ కమలాపురం, జమ్మల మడుగు, మైదుకూరు, బద్వేలును అలా వదిలేశారు. మళ్లీ ఇప్పుడు మేం సిద్ధం.. పేరిట సొంత జిల్లా ఇడుపుల పాయలలో వైఎస్‌కు నివాళులర్పించి అక్కడి నుంచే బస్సుయాత్ర చేసి ప్రొద్దుటూరులో సభ నిర్వహించనున్నారు. జనానికి జగన్ పాదయాత్ర సమయంలో, ఎన్నికల నాటి సభల్లో ఇచ్చిన హామీలు మరోసారి చెవుల్లో గుయ్ మంటూ వినిపిస్తున్నాయి. ఇచ్చిన హామీలు నెరవేర్చనందుకా మీరు సిద్ధం.. అని ప్రశ్నిస్తున్నారు.

అరాచకాలకు అడ్డాగా ప్రొద్దుటూరు

సీఎం జగన్ మేం సిద్ధం పేరిట బహిరంగసభ నిర్వహించే ప్రొద్దుటూరు పట్టణం.. అభివృద్ధి అటుంచితే జిల్లాలో అరాచకాలకు కేరాఫ్‌గా మారిందన్న విమర్శలున్నాయి. ఇంతకాలం బంగారు, వస్త్ర వ్యాపారానికి ఎలా ప్రసిద్ధో.. ఇప్పుడు భూదందాలు, అక్రమాలు ప్రశ్నించే వారిని లేపేయడం, దొంగనోట్ల వ్యవహారంతో స్టేట్‌లోనే ఫేమస్ అయి పోయిందని అంటారు.

ఉక్కు కథ కంచికేనా..

జిల్లావాసి జగన్ సీఎం కావడంతో నిరుద్యోగుల్లో ఉక్కుఫ్యాక్టరీపై ఆశలు చిగురించాయి. అందుకు తగ్గట్లుగానే జగన్ సీఎం అయిన ఆరుమాసాలకే అంటే 2019 డిసెంబరు 23న వైఎస్సార్ స్టీలు ప్లాంటు నిర్మాణానికి టెంకాయ కొట్టారు. "ఎన్నికలకు ఆరు నెలల ముందు అభివృద్ధి పనులకు టెంకాయ కొడితే దానిని నమ్మకద్రోహం అంటారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో టెంకాయ కొడితే దానిని చిత్తశుద్ధి అంటారు. ఉక్కు పరిశ్రమకు ఆరు నెలల ముందు చంద్రబాబు టెంకాయ కొడితే మన ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే టెంకాయ కొట్టినా.. ఇదీ విశ్వసనీయత అంటే.." అంటూ చెప్పుకొచ్చారు. ఆ సందర్భంగా మూడేళ్లలో పూర్తి చేస్తామని జగన్ చెప్పారు. మూడేళ్లు అయినా అతీ గతీ లేదు. చివరికి గత ఏడాది ఫిబ్రవరి 15న మరోసారి ఇదే ఫ్యాక్టరీ నిర్మాణానికి టెంకాయ కొట్టారు. రాబోయే 24 నెలల నుంచి 30నెలల్లో ఈ ప్రాజెక్టు పూర్తవుతుందని అన్నారు. నాన్న చని పోయాక ఈ ప్రాంతాన్ని పట్టించుకునే నాధుడే లేడని దేవుడి దయ. మీ ఆశీర్వాదాలతో మీ బిడ్డ ప్రమాణ స్వీకారం చేశాక ఈ ప్రాంతానికి మంచి రోజులు రావడం మొదలయ్యాయని జగన్ గొప్పగా చెప్పుకొచ్చారు. ఈ మాటలు చెప్పి జగన్ ఈ ఏడాది ఫిబ్రవరి 15కు సంవత్సరం అయింది. అంటే పనులు పూర్తవుతా యని చెప్పిన 24నెలల్లో ఇప్పటికే 13 నెలలు పూర్తయ్యాయి. అక్కడ ఎలాంటి పురోగతి లేదు... రెండు షెడ్లు తప్ప ఏ నిర్మాణం జరగలేదు. ఉక్కుఫ్యాక్టరీ పూర్తయి ఉంటే కడప మరో విశాఖ తరహాలో అభివృద్ధి చెందేది.. ఈ విషయంలో నిరుద్యోగులు నిరాశకు గురయ్యారు.

అన్యాయాన్ని ప్రశ్నించిన.. బీసీ నేత నందం సుబ్బయ్యను లేపేశారు

వైసీపీ అధికారంలోకి వచ్చాక.. అధికారుల సాక్షిగా.. ప్రొద్దుటూరులో జరిగిన టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి, బీసీ నేత నందం సుబ్బయ్య హత్య రాష్ట్రంలోనే కలకలం రేపింది. భూదందాలు, ఇసుక అక్రమాలపై నందం సుబ్బయ్య విలేకరుల సమావేశం పెట్టి ఎమ్మెల్యే రాచమల్లు ఆయన బావమరిదిపై విమర్శలు ఎక్కువపెట్టేవారు. సోషల్ మీడియా వేదికగా దందాపై పెద్దఎత్తున ప్రశ్నించేవారు. 2020 డిసెంబరు 29న రామేశ్వరం జగనన్న లేఅవుట్ ప్రారంభోత్సవం జరుగుతున్న సమయంలో నందం సుబ్బయ్యను పట్టపగలు నరికి చంపారు. ఈ హత్య అక్కడకు వచ్చిన అధికారులు చూస్తుండగానే జరిగింది. నందం సుబ్బయ్య భార్య అపరాజిత ఎమ్మెల్యే రాచమల్లు ఆయన బావమరిది బంగారురెడ్డి, కమిషనర్ రాధలను కేసులో చేర్చాలంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ హత్యను నిరసిస్తూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ప్రొద్దుటూరుకు వచ్చారు. పబ్లిక్‌గా అందరిముందూ హత్య జరిగినా.. ఈ కేసులో నిందితులకు ఇప్పటికీ శిక్ష పడలేదు.



ఎమ్మెల్యే రాచమల్లు ఇంటికి ఎదురుగా చెన్నకేశవ ఆలయ భూముల్లో వేసిన రోడ్డు

రూ.2వేల కోట్లతో అభివృద్ధి చేయకుంటే.. తూ.. నాకొడకా అనండి : ఎమ్మెల్యే రాచమల్లు

జగన్ సీఎం అయితే ఏటా రూ.500 కోట్ల చొప్పున రూ.2వేల కోట్లతో ప్రొద్దుటూరును అభివృద్ధి చేస్తామంటూ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి జనానికి హామీ ఇచ్చారు. తీసుకురాకపోతే తూ నాకొడకా... అనండంటూ జనానికి ఆఫర్ ఇచ్చారు. జగన్ సీఎం అయ్యాక 2021 డిసెంబరు 23న రూ.515.40 కోట్లతో తొమ్మిది అభివృద్ధి పనులకు శిలాఫలకాలు వేశారు. ప్రొద్దుటూరులోని కొత్తపల్లె చానెల్‌తో పాటు 75 కి.మీ మేర కాల్వ ఆధునికీకరణ పనులకు టెండర్లు పూర్తయ్యాయి తప్ప పనులు ప్రారంభం కాలేదు. ప్రొద్దుటూరు పట్టణంలో పైపులైను ఆధునికీకరణ కోసం నిధులు కేటాయించినట్లు చెప్పారు. ఈ పనులూ పూర్తి కాలేదు. ఇక రామేశ్వరం నుంచి ఆర్టీపీపీ మార్గాన పెన్నానది హైలెవెల్ పనులు సగం మాత్రమే పూర్తయ్యాయి. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టరు పనులు నిలిపివేసినట్లు చెబుతారు. ప్రొద్దుటూరు ఆర్టీసీ బస్టాండు నిర్మాణ పనులు చేపట్టినా ఇంకా పూర్తి కాలేదు. కూరగాయల మార్కెట్ ఆధునికీకరణ పనులు ఇంకా పిల్లర్ల దశలో ఉంది. జిల్లా ఆసుపత్రి అదనపు భవనాల పనులు మాత్రం పురోగతిలో ఉన్నాయి. ఇంజనీరింగ్ కాలేజీ అదనపు భవనాల కోసం చేపట్టిన పనులు తొలి దశలో ఉన్నాయి. ఆర్ట్స్ కాలేజీ నూతన భవనాల పనులు టెండరు దశలోనే ఆగిపోయాయి. ఒక్క పని కూడా పూర్తి కాలేదు. ఇక ఎన్నికల సమయానికి ప్రొద్దుటూరు పాలఫ్యాక్టరీ తీసుకువస్తామని హామీ ఇచ్చారు. అయితే అదీ అటకెక్కింది. ఐదేళ్లలో రూ.2 వేల కోట్లు కాదు కాదు కదా.. కేటాయించిన రూ.515.40 కోట్లలో సగం కూడా ఖర్చు కాలేదు. మళ్లీ ఎన్నికలు వచ్చాయి. ఇప్పుడు రాచమల్లును ఏమనాలని జనం ప్రశ్నిస్తున్నారు.

అంతులేనంత అవినీతి

- ప్రొద్దుటూరులో దొంగనోట్ల వ్యవహారం కలకలం రేగింది. వైసీపీకి చెందిన బొంది కార్పొరేషన్ డైరెక్టరుగా ఉన్న రసపుత్ర రజని బెంగళూరులో దొంగ నోట్ల కేసులో పట్టుబడ్డారు. ఆమెను అక్కడి పోలీసులు అరెస్టు చేశారు.
- సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులకు సంబంధించి కోట్లాది రూపాయలు గోల్‌మాల్ అయ్యాయి. దీనికి సూత్రధారి ప్రొద్దుటూరులోనే ఉన్నట్లు అధికారులు ప్రకటించారు.
- కల్లూరు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ హైవే పక్కనే ఉంటుంది. కాల్వకు సంబంధించి 2.5 ఎకరాలను ఆక్రమించారు. అధికారులు కూడా ధ్రువీకరించారు. ఇక్కడ సెంటు రూ.20లక్షలు పలుకుతుంది. ఆ స్థలాన్ని పక్కనున్న రియల్ ఎస్టేట్ వెంచరులో కలుపుకుని లేఅవుట్‌లు వేశారు. చౌటపల్లె రెవెన్యూ పొలంలో ఐదు ఎకరాల చర్చి భూములు కాజేసినట్లు చెబుతారు.
- ఎమ్మెల్యే రాచమల్లు ఇంటి ఎదురుగా ఉన్న చెన్నకేశవాలయానికి చెందిన రూ.40కోట్ల విలువచేసే నాలుగు ఎకరాల భూమిని చదును చేసి రోడ్ల నిర్మాణం చేపట్టారు.
- ప్రొద్దుటూరు పెన్నా నదితో రాత్రింబవళ్లు ఇసుక ను అక్రమంగా తవ్వి కొల్లగొట్టారు. అడ్డుకునే ప్రయత్నం చేసిన మహిళా ఎస్ఐపైనే రాళ్లదాడి చేశారు.
- అక్రమంగా మద్యం తీసుకెళుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినందుకు.. ఏకంగా ఎమ్మెల్యే రాచమల్లు సెబ్ కార్యాలయానికి వెళ్లి సీఐ సీట్లో కూర్చుని ఆయననే బెదిరించారు.
- ప్రొద్దుటూరులో ఆర్యవైశ్యుల పేదల భూములను బెదిరించి లాక్కున్నారన్న విమర్శలు ఉన్నాయి.
- జిల్లాలో పెద్దఎత్తున భూకబ్జాలు సాగాయి. కడప, కమలాపురం, మైదుకూరు, బద్వేలు, పోరుమామిళ్ల, వేంపల్లె, పులివెందుల, జమ్మలమడుగు ఇలా ప్రతి చోటా భూముల ఆక్రమణలు కోకొల్లలుగా జరిగాయి. నాలుగురోజుల క్రితం ఒంటిమిట్ట మండలం మాధవరానికి చెందిన పాల సుబ్బారావు తమ భూమిని ఇతరుల పేరిట ఆన్‌లైన్ చేసేయడంతో భూమికోసం పోరాటం చేసి వేరేదారిలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయనతో పాటు భార్య కూతురు సైతం చనిపోయారు. మేము సిద్ధం అంటూ జగన్ జిల్లాకు వస్తుండడంతో జనాలకు ఇవన్నీ గుర్తుకు వస్తున్నట్లు చెబు తున్నారు.



ప్రొద్దుటూరులో మార్కెట్‌యార్డు నిర్మాణం ఇలా



ఆగిన హై లెవెల్ వంతెన పనులు



హత్య జరగడానికి కొన్ని నిమిషాల ముందు నందం సుబ్బయ్య సెల్ఫీ.. చిత్రంలో నందం సుబ్బయ్య వెనుక వైపు జగనన్న లేఅవుట్ కోసం జరుగుతున్న పనులు

నీటి ఎద్దడిని అధిగమిద్దాం : కలెక్టర్

కడప(కలెక్టరేట్), మార్చి26: జిల్లా వ్యాప్తంగా వేసవిలో తాగునీటి ఎద్దడిని అధిగమించేందుకు ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. జిల్లాలో తాగునీటి కొరత, వడగాల్పులు, వడదెబ్బ, ముందస్తు జాగ్రత్త చర్యలపై మంగళవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో జాయింట్ కలెక్టర్ గణేశ్‌కుమార్, నగర కమిషనర్ ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కమిషనర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో గంగాధర గౌడ్‌లతో కలసి జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది ముందుగానే అధిక ఉష్ణోగ్రతుల నమోదు అవుతున్నాయన్నారు. ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అన్ని మండలాల్లో తాగునీరు కొరత లేకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ప్రజల సౌకర్యార్థం వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. వడదెబ్బ కేసులను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేసి పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి, డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ వీరన్న, ఇరిగేషన్ అధికారులు, అనుబంధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

ఒక్క హామీ అయినా నెరవేర్చారా..?

- సిద్ధం పేరుతో మళ్లీ మోసం చేసే ప్రయత్నం
- ఓట్లు అడిగే నైతిక హక్కు జగన్‌రెడ్డికి లేదు
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 26: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో జిల్లాకు ఇచ్చిన ఎన్నికల హామీలో ఒక్కటయినా నెరవేర్చారా అని టీడీపీ పొలిట్‌బ్యూరోసభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. సిద్ధం పేరుతో మళ్లీ ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని... ఆయనకు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. మంగళవారం కడప నగరంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... స్టీలు ప్లాంటుకు ఎన్నిసార్లు శంకుస్థాపనలు చేశారో ఒకసారి గుర్తుకు చేసుకోవాలన్నారు. ప్రొద్దుటూరులో పాలఫ్యాక్టరీ, నందలూరు ఆల్విన్, చెన్నూరు షుగరు ఫ్యాక్టరీ ఓపెన్ చేయిస్తామని ఎన్నికల్లో చెప్పిన హామీలో ఒక్కటైనా అమలైందా అన్నారు. కడప-బెంగళూరు రైలు మార్గం దివంగత వైఎస్ మంజూరు చేయించారని.. జగన్‌రెడ్డి సీఎం అయ్యాక ఆ రైలు మార్గాన్ని ఎందుకు ఆపేశారని ప్రశ్నించారు. కడప నగరంలో ఐటీ సెజ్ ఏర్పాటు చేశారని అందులో ఒక్క ఐటీ కంపెనీ అయినా వచ్చిందా అని ప్రశ్నించారు. షిరిడిసాయి ఎలక్ట్రానిక్స్‌కు భూమి దారాదత్తం చేశారని ఆరోపించారు. ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించి ఇచ్చిన జీవోలు ఒక్కటైనా పూర్తయిందా అన్నారు. కడప నగరంలో తాగునీటి ఎద్దడి తీర్చేందుకు ఈ ఐదేళ్ల వైసీపీ పాలనలో కడప ఎమ్మెల్యే కానీ సీఎం కానీ ఒక్కరోజైనా అధికారులతో సమీక్షించారా అని ప్రశ్నించారు. మీరు దేనికి సిద్ధం.. మళ్లీ మోసం చేసేందుకేనా అని అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. కనీసం జిల్లాలో కరువు మండలాలుగా ప్రకటించకపోవడం దుర్మార్గమన్నారు. ముఖ్యమంత్రికి జిల్లాలో ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని స్పష్టం చేశారు. టీడీపీ కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి మాట్లాడుతూ ప్రజలు నీటి సమస్యతో అల్లాడుతున్నారని అన్నారు. మైలవరం డ్యాం నుంచి నీరు తెస్తున్నామంటున్నారని, ఆ నీరు ఎప్పుడు వస్తుందో తెలియదన్నారు. కేవలం ఇది ఎన్నికల ప్రచారం తప్ప నిజంగా ప్రజల దాహార్తి తీర్చే ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా సీఎం సురేశ్‌నాయుడు

ప్రొద్దుటూరు, మార్చి 26: టీడీపీ సీనియర్ నాయకుడు సీఎం సురేశ్ నాయుడును రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా అధిష్టానం నియమించింది. ఆ మేరకు రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సురేశ్ నాయుడు మాట్లాడుతూ.. పార్టీ గెలుపుకోసం కృషి చేస్తానని అన్నారు.



పులివెందుల ఓఎస్డీపై విచారణకు ఈసీ ఆదేశం


కడప, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పులివెందుల పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డిపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ విచారణకు ఆదేశించింది. ఈనెల 23న బీటెక్ రవి ఓఎస్డీపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఎన్నికల కోడ్ వచ్చే ముందురోజు వరకు వైసీపీ, ఓఎస్డీ కార్యాలయాలు ఒకే భవనంలోనే నిర్వహించారన్నారు. ఎన్నికల కోడ్ వచ్చే ముందురోజు మినీ సెక్రటరియేట్ కార్యాలయానికి ఓఎస్డీ కార్యాలయాన్ని మార్చారన్నారు. ఎన్నికల కోడ్ వస్తున్న సమయంలోనే ఓఎస్డీ కార్యాలయాన్ని మార్చడం, అప్పటివరకు ఓఎస్డీ కార్యాలయం, వైసీపీ కార్యాలయం అనే తేడా లేకుండా సాగిందన్నారు. ఎన్నికల విధుల కోసం అందించే వైర్‌లెస్ సెట్‌ను కూడా ఓఎస్డీ కార్యాలయంలో ఏర్పాటు చేశారని ఈసీకి నివేదించారు. దీంతో ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డిపై విచారణకు మంగళవారం ఈసీ ఆదేశాలు జారీ చేసింది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు పులివెందుల ఓఎస్డీని, ఆర్డీఓను కడపకు పిలిచి విచారణ చేపట్టారు. దీంతో వైర్‌లెస్ సెట్ అప్పటికప్పుడు ఓఎస్డీ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయానికి తరలించారు. బుధవారం మరోమారు విచారణకు రావాలని ఆదేశించినట్లు సమాచారం.

జడ్పీ సర్వసభ్య సమావేశం.. 30 నిమిషాలే...!

- రాజంపేట ఎమ్మెల్యేగా పోటీచేస్తున్నా
- జడ్పీ చైర్మన్ ఆకేపాటి
- మంత్రిగా రావాలంటూ వైసీపీ జడ్పీటీసీల భజన
- యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన
- నీటి సమస్యపై చర్చ నామమాత్రమే

కడప(రూరల్), మార్చి 26: దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. అయితే జడ్పీ పాలకమండలి తమకు ఎన్నికల కోడ్ వర్తించనట్లుగా వ్యవహరించింది. మంగళవారం నిర్వహించిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో అధికారుల సాక్షిగా అడుగడుగునా కోడ్ ఉల్లంఘన కనిపించింది. జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి సభకు అధ్యక్షత వహించి తాను రాజంపేట(వైసీపీ) ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్నానని జిల్లా అధికారులు ఉన్న సమావేశంలో చెప్పారు. జడ్పీ చైర్మన్‌గా రెండున్నర సంవత్సరాలు పూర్తి చేశానని ఇకపై ఎమ్మెల్యే హోదాలో ఇక్కడికి వస్తానన్నారు. వైసీపీ జడ్పీటీసీలు నీవు ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రిగా జడ్పీ వేదికపై కూర్చుంటావని చైర్మన్‌కు భజనచేశారు.

కాగా.. జడ్పీ సర్వసభ్య సమావేశం ఉదయం 9 గంటలకే ప్రారంభం కావాల్సి ఉంది. ఆ మేరకు 17 శాఖల అధికారులంతా హాజరయ్యారు. అయితే జడ్పీ చైర్మన్ 10:40 గంటలకు రావడంతో అప్పుడు సమావేశాన్ని ప్రారంభించారు. ఆయన వచ్చిన 30 నిమిషాలకే సర్వసభ్య సమావేశాన్ని ముగించేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ అమరనాథరెడ్డి

నీటి సమస్యపై చర్చ ఇలా

జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ మొదలైంది కాబట్టి ఎన్నికల సంఘం అనుమతితో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. కేవలం తాగునీటి ఎద్దడిపైనే చర్చించాలని చెప్పారు. దీంతో ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ చర్చకు రాగా అన్నమయ్య జిల్లా ఎస్ఈ మాట్లాడుతుండగా చైర్మన్ కలగజేసుకుని సభ్యులు వారి ప్రాంతాలలో ఉన్న సమస్యలను తెలియజేయాలని సూచించారు. పోరుమామిళ్ల జడ్పీటీసీ ముత్యాల చెన్నయ్య, చక్రాయపేట జడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డి, వేంపల్లె జడ్పీటీసీ రవిప్రసాద్‌రెడ్డి, బద్వేల్ మండల జడ్పీటీసీ మాట్లాడుతూ తమ మండలాల్లో పలు గ్రామాల్లో నీటి సమస్య ఉందని ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. కో-ఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా మాట్లాడుతూ ఖాజీపేట మండలంలో నీటిఎద్దడి తీవ్రంగా ఉందన్నారు. గండికోట నుంచి కడపకు వదులుతున్న నీటిలో కొంతమేర ఆదినిమ్మాయపల్లె డ్యామ్ నుంచి 10 రోజుల పాటు మండలానికి తరలించాలని కోరారు.

నీటి సమస్యపై మొక్కుబడి చర్చ

జిల్లాలో కరువు కోరలు విజృంభిస్తున్నాయి. భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. ప్రాజెక్టులు, డ్యామ్‌లలో నీరు డెడ్‌స్టోరేజ్‌కు చేరాయి. నదులు, చెరువులు, వాగులు ఎండిపోయాయి. జిల్లాలో మంచినీటి ఎద్దడి ముంచుకొస్తోంది. ఈ సమస్య పరిష్కారానికి వైసీపీ ప్రభుత్వం ఆర్‌డబ్ల్యుఎస్ శాఖకు ఒక్క రూపాయి నిధులు విదిల్చలేదు. పంచాయతీ నిధులతో నెట్టుకొస్తున్నారు. ఇలాంటి తరుణంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ నీటి సమస్య పరిష్కారం పేరుతో జడ్పీ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. కానీ నీటి సమస్యపై తూతూ మంత్రంగా చర్చించి కేవలం 30 నిమిషాలలోనే ముగించారు. కాగా.. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపధ్యంలో జడ్పీ సర్వసభ్య సమావేశానికి ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్, జేసీ హాజరుకాలేదు. జడ్పీ సీఈవో ఎం.సుధాకర్‌రెడ్డి ఉదయం 9 గంటల ప్రాంతంలో జడ్పీకి వచ్చి వెళ్లిపోయారు. ఆయన స్థానంలో డిప్యూటీ సీఈవో రమణారెడ్డి హాజరయ్యారు.

వ్యాన్ బోల్తా : ఇద్దరు మృతి

అహోబిలం వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం





మృతి చెందిన దేరంగుల ప్రసాద్, సంఘటనా స్థలంలో ప్రమాదానికి గురైన వ్యాన్

సింహాద్రిపురం, మార్చి 26: మండలంలోని గురిజాల గ్రామ సమీపాన మంగళవారం బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఇద్దరు మృతి చెందారు. మరో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. అహోబిలం పుణ్యక్షేత్రం వెళ్లి తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో అనంతపురం జిల్లా ధర్మవరం పట్టణం కేతిరెడ్డి కాలనీకి చెందిన దేరంగుల ప్రసాద్ (25) అక్కడికక్కడే మృతి చెందగా, దేరంగుల వెంకటమ్మ (83) పులివెందుల ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. సింహాద్రిపురం ఎస్ఐ అనిల్‌కుమార్ సమాచారం మేరకు... అనంతపురం జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన కొంతమంది కర్నూలు జిల్లా అహోబిళంలోని లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని తిరిగి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. అహోబిళం నుంచి సోమవారం తిరుగు ప్రయాణంలో భాగంగా మార్గమధ్యంలో ధర్మవరం చేరుకోగానే రాత్రి అవ్వడంతో సింహాద్రిపురం మండలంలోని అంకాళమ్మ గూడూరు గ్రామం వద్ద వ్యాను ఆపుకుని నిద్రించారు. తిరిగి మంగళవారం ఉదయం ప్రయాణం సాగిస్తుండగా సింహాద్రిపురం-గురిజాల గ్రామాల మధ్య వ్యాన్ అదుపు తప్పి ప్రమాదం జరిగినట్లు ఎస్ఐ వివరించారు. మృతుడి భార్య గౌతమి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనీల్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

వేంపల్లె, మార్చి 26: వేంపల్లె పట్టణ గండిరోడ్డులో ఘర్షణ పడి కత్తిపోట్లకు గురైన నరసింహులు (27) అనే వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని సీఐ చాంద్‌బాష తెలిపారు. సీఐ వివరాల మేరకు... మూడు రోజుల క్రితం ఇరువర్గాలు కత్తితో దాడి చేసుకుని నలుగురు గాయపడ్డారు. అసభ్యంగా మాట్లాడుకోవడంతో ఈ ఘర్షణ చోటుచేసుకుంది. సోమవారం అర్ధరాత్రి దాటాక కడప రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నరసింహులు మృతి చెందాడని సీఐ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడ్డ విద్యార్థులు

రైల్వేకోడూరు(రూరల్) మార్చి 26: మండలంలోని శెట్టిగుంట పంచాయతీ ప్రధాన రహదారి మారావారిపల్లి వద్ద స్కూటీని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు... పోలీసుల వివరాల మేరకు శెట్టిగుంట పంచాయతీ లక్ష్మీగారిపల్లి ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న సాహిల్, జస్వంత్ మంగళవారం పదో తరగతి పరీక్షలు రాసి గ్రామానికి వెళ్తుం డగా తిరుపతి నుంచి గిద్దలూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన స్థలం వద్ద నిలబడి ఉన్న మరో తొమ్మిదో తరగతి విద్యార్థి మనోజ్ స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించి గాయపడ్డ విద్యార్థులను తిరుపతిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పులివెందులకు నీళ్లిచ్చిన ఘనత టీడీపీదే

టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి, బీటెక్ రవి

చక్రాయపేట, మార్చి 26: పులివెందులకు నీళ్లిచ్చిన ఘనత టీడీపీదేనని టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, పులివెందుల నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి తెలిపారు. మంగళవారం మండలంలోని సిద్దారెడ్డిగారిపల్లెలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని టీడీపీ నేత భాస్కర్‌రెడ్డి (ఎల్‌బీఆర్), లోమడ రవీంద్రారెడ్డిల ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి టీడీపీకి మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన ఎన్నికల మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ, జగన్ రైతులకు చేసిన అన్యాయంపై వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలో చీనీ చెట్లు ఎండిపోతుంటే రైతులను ఆదుకునేందుకు గత టీడీపీ ప్రభుత్వ పాలనలో నీళ్లు ఇచ్చారన్నారు. 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉండి ప్రజాప్రతినిధులుగా ఉన్న వైఎస్ కుటుంబం రైతులకు నీళ్లు ఇవ్వని పరిస్థితి ఏర్పడిందన్నారు. పులివెందులలోనే ఏమీ చేయలేదని ప్రజలు, రైతులు నిరాశతో ఉన్నారని చెప్పారు. సచివాలయ భవనాలు, వలంటీర్లు నియామకం చేస్తూనే అభివృద్ధి చేసినట్లు కాదని చెప్పారు. నీటి పారుదల వ్యవస్థను, రైతులను కాపాడుకున్నప్పుడే రాష్ట్రం బాగుపడుతుందని చెప్పారు. ఎక్కువగా అరటి, నిమ్మ, చీనీతోటలు సాగులో ఉన్నాయని, అలాంటి ప్రాంతంలో కరువు విలయతాండవం చేస్తుంటే కరువు మండలంగా సీఎం జగన్ ప్రకటించడానికి మనసు రాలేదంటే ఆయనేం ముఖ్యమంత్రి అని ఎద్దేవాచేశారు. సొంత నియోజకవర్గానికి ఏమీ చేశాడో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తుందని, రైతుల సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కర్నాటి అమర్‌నాథరెడ్డి, కర్నాటి నాగభూషణ్‌రెడ్డి, నియోజకవర్గ జనసేన అధ్యక్షుడు తుపాకుల చంద్ర, పట్టెం అశోక్‌కుమార్, ఎద్దుల చంద్ర, రామాంజనేయరెడ్డి, నరసింహులు, దాసరి ఆంజనేయులు, యోగేశ్వర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో డ్రగ్స్ మాఫియాను అరికట్టాలి

టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేపూరి వేణుగోపాల్



సమావేశంలో మాట్లాడుతున్న రేపూరి వేణుగోపాల్

నందలూరు, మార్చి 26: ఆంధ్రప్రదేశ్‌లో డ్రగ్స్ మాఫియాను అరికట్టాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేపూరి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ అన్నపూర్ణాంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనుడు జగన్‌మోహన్‌రెడ్డి అని విమర్శించారు. మొదట ఓటర్లను మత్తు పదార్థాలకు బానిసగా చేసి ఓట్లు దండుకోవాలని వైసీపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో అన్ని కాలేజీల్లో డ్రగ్స్ సరఫరా యథేచ్ఛగా జరుగుతోందన్నారు. గంజాయి వినియోగం ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో ఏపీని 12వ స్థానానికి తెచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు.

టీడీపీ హయాంలో ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో ఏపీ నెంబరు-1 స్థానంలో ఉంటే నేడు గంజాయి అక్రమ రవాణాలో నెంబరు-1 స్థానంలో ఉందన్నారు. గతంలో గుజరాత్ ముంద్రా పోర్టులో ఆఫ్ఘనిస్తాన్ నుంచి ఇరాన్ ద్వారా బెజవాడలోని ఓ ట్రేడింగ్ కంపెనీ పేరుతో రవాణా చేస్తున్న 72 వేల కోట్ల హెరాయిన్ పట్టుబడిందని, నేడు బ్రెజిల్ నుంచి వైజాగ్ పోర్టుకు తెచ్చిన 50 వేల కోట్ల డ్రగ్స్ దొరికాయన్నారు. యువత వైసీపీ రొచ్చులో పడకుండా జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో విలువైన ఓటు ద్వారా తమ భవిష్యత్తును బంగారుమయంగా చేసుకోవాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చుక్కా యానాది, జ్యోతి శివ తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.1.91 లక్షలు

సీకేదిన్నె, మార్చి 26: చింతకొమ్మదిన్నె గంగమ్మ గుడి హుండీ ఆదాయం రూ.1,91,650 వచ్చినట్లు ఆలయ ఈవో సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఫిబ్రవరి, మార్చి నెలల ఆదాయాన్ని మంగళవారం భక్తుల సమక్షంలో లెక్కించగా ఆ మొత్తం వచ్చినట్లు తెలిపారు. వచ్చిన ఆదాయాన్ని దేవస్థానం పేరుతో బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ విశ్వనాథరెడ్డి, దేవాదాయ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్, భక్తులు పుల్లయ్య, ఈశ్వర్‌రెడ్డి, యల్లారెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపయోగంగా మారిన సింటెక్స్ ట్యాంకు



పేరుకే బోరు ఉందంతే...



సొంతింటి కల నెరవేరేనా..!

- నిలిచిపోయిన జగనన్న కాలనీల గృహాలు
- బిల్లులు అందని దుస్థితి
- నిర్మాణాలకు నీటి వసతి నిల్
- అలంకారప్రాయంగా ట్యాంకు
- పనిచేయని బోర్లు.. ఇబ్బందుల్లో లబ్ధిదారులు
- పట్టించుకోని అధికారులు

జమ్మలమడుగు, పొన్నతోట జగనన్న కాలనీ



జమ్మలమడుగు, మార్చి 26: జమ్మలమడుగులో జగనన్న కాలనీల గృహ నిర్మాణాలు నిలిచిపోయాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం జమ్మలమడుగు శివార్లలో కొండ ప్రాంతాలకు ఆనుకుని పేదవారికి స్థలాలు ఇచ్చింది. ప్రభుత్వమే ఇళ్లు కట్టించి ఇస్తుందని పేదలు, సొంతిళ్లు లేనివారు ఆశించారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే మొత్తం తక్కువ కావడంతో పేదలు అప్పులు చేసి ఇళ్లు కట్టుకునేందుకు వెనకడుగు వేశారు. చివరకు కాంట్రాక్టర్లకు అప్పగించి ఇళ్లు నిర్మిస్తామని కొందరు వైసీపీ నాయకులు హామీ ఇచ్చారని లబ్ధిదారులు పేర్కొన్నారు. ఇక తాము త్వరలో సొంతింటికి వెళతామని ఆశించామని.. అయితే కాలనీలో ఇళ్ల పనులు ఆగిపోయాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని పేదలకు ముద్దనూరు రోడ్డులో అంబవరం పాలిటెక్నిక్ కళాశాల వెనుకభాగాన ఇళ్లస్థలాలు ఇచ్చారు. కాంట్రాక్టర్లతో బోర్లు వేయించి సింటెక్స్ ట్యాంకులు ఏర్పాటు చేయించి గృహాలు నిర్మించి ఇస్తామని కొందరు వైసీపీ నాయకులు కాంట్రాక్టర్ల అవతారమెత్తారు. ఈ మేరకు పేదల నుంచి బిల్లులు తీసుకుని కొంతవరకు నిర్మించి తర్వాత ఇళ్లు కట్టకుండా వదిలేశారని సమాచారం. దీనికితోడు సిమెంటు, కడ్డీలు, తదితర ఇంటి సామాగ్రి తెచ్చే వ్యాపారులక్కు డబ్బులు ఇవ్వకుండా కొందరు ఇబ్బంది కలిగిస్తున్నట్లుగా తెలుస్తోంది. మొత్తం 2,247 ఇళ్లకుగాను 500పైగా వివిధ దశల్లో నిర్మాణాలు చేసినట్లుగా తెలుస్తోంది. జగనన్న కాలనీలో సిమెంటు రోడ్లు లేవు. కొందరు విద్యుత్ మీటర్లకు డబ్బులు చెల్లించినా మీటర్లు ఇంకా ఇవ్వలేదని తెలుస్తోంది. రాత్రి సమయాల్లో కరెంటు లేక ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు వాపోతున్నారు.



అలంకారప్రాయంగా మంచినీళ్ల ట్యాంకు

పొన్నతోట లబ్దిదారులకు..

జమ్మలమడుగు మండలంలోని పొన్నతోట జగనన్న కాలనీ లబ్ధిదారులకు ఆర్‌అండ్‌ఆర్ కాలనీ శివార్లలో స్థలాలు ఇచ్చారు. ఆ ప్రాంతం చాలా దూరం కావడం, చివరిలో ఉండడం వలన చాలా మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవడానికి శ్రద్ధ చూపడం లేదు. అక్కడ 436 మంది లబ్ధిదారులకు స్థలాలు ఇస్తే కేవలం వందమందిలోపే ఇళ్ల నిర్మాణానికి ముందుకు వచ్చారు. అయితే ఒక్కరు కూడా నివాసం లేరు. కారణం ఆ ప్రాంతంలో తాగునీరు లేదు. సంబంధిత అధికారులకు అనేకసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో మంచినీళ్ల ట్యాంకు అలంకారప్రాయంగా మారింది. దాని పక్కనే ఇనుప పైపులు నిరుపయోగంగా పడవేశారు. కాలనీలో సింటెక్స్ ట్యాంకుల చుట్టూ కంపచెట్లు మొలిచాయి. రోడ్లు లేక మంచినీటిపైపులు పగిలిపోయి నీరు అందక నిర్మాణాలకు నీళ్లు లేక లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌అండ్ ఆర్ కాలనీ శివార్ల నుంచి గ్రావెల్ తోలి మంచినీటి పైపులు పగిలిపోయి నీరు అందక ఇబ్బంది పడుతున్నట్లు వాపోతున్నారు. ఒక్క రోజు అయినా ఆ కాలనీలలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పేద ప్రజల ఇళ్ల నిర్మాణాలు ఎలా ఉన్నాయని పరిశీలించలేదని ఆ ప్రాంతవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారి ఏమన్నారంటే..

ఈ సమస్యలకు సంబంధించి జమ్మలమడుగు హౌసింగ్ ఏఈ ఓబులేసును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఆ కాలనీలో నీరు లేదని, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు చెప్పినా నిధులు లేక పట్టించుకోవడం లేనట్లుగా ఉందని అన్నారు. మరోవైపు ఇసుక ట్రాక్టర్లు, గ్రావెల్ తరలించే ట్రాక్టర్లు నీళ్ల పైపులపై వెళ్లడంతో పైపులన్నీ పూర్తిగా ధ్వంసమయ్యాయన్నారు. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలు జరగడం లేదని ఆయన తెలిపారు.



ఊడిపోయిన పైపులు

అనుమతులు లేకుండా ప్రచారాలు చేస్తే చర్యలు

రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), మార్చి 26: ఎన్నికల ప్రచారం చేపట్టాలనుకునే వారు ఎన్నికల సంఘం నియమ నిబంధనల మేరకు ముందస్తు అనుమతులు త ప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో ఎ న్నికల ప్రవర్తనా నియమావళిపై జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్, నగర కమిషరు ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, డీఆర్వో గంగాధర్‌గౌడ్‌లతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలనుకుంటే ఆయా నియోజకవర్గంలోని సంబంధిత రిటర్నింగ్ అధికారుల నుంచి అనుమతులు పొందాలన్నారు. ఒకవేళ అనుమతులు లేకుండా ప్రచారాలు చేస్తే కోడ్ ఉల్లంఘన కింద తప్పనిసరిగా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు హరిప్రసాద్ (టీడీపీ) కానుగ దానం (బీఎస్పీ), జి.లక్ష్మణరావు (బీజేపీ), ప్రసాద్ గౌడ్ (కాంగ్రెస్), చంద్రశేఖర్ (సీపీఎం), మల్లికార్జున, శ్రీనివాసులు, ఎన్నికల నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలొద్దు... నిష్పక్షపాతంగా పనిచేయండి

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక ప్రవర్తనా నియమావళి వర్తిస్తుందని ఎవ్వరూ రాజకీయాల జోలికి పోకుండా నిష్పక్షపాతంగా పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు అనుకూలంగా వ్యవహరించకూడదని.. రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొనడం, బహుమతులు తీసుకోవడం కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని తెలిపారు. రాజకీయాల్లో ప్రభుత్వ ఉద్యోగి భార్య లేదా భర్త ఉంటే, వారు ఎన్నికలు పూర్తయ్యే వరకు సెలవులు లేదా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి అనుమతి తీసుకోవాలని తెలిపారు.

రూ.19.63 లక్షల నగదు సీజ్

ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై అందిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 215 ఫిర్యాదులు అందగా వాటిలో 209 పరిష్కరించామని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన నాటి నుంచి నేటి వరకు పది రోజుల్లో చేపట్టిన తనిఖీల్లో రూ.19.63 లక్షల నగదుతో పాటు రూ.63.01 లక్షల విలువైన మద్యం సీజ్ చేశామని తెలిపారు. అలాగే 116 ఎఫ్ఐఆర్ కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు.

యథేచ్ఛగా ఇసుక దోపిడీ

- అడ్డుకున్న గ్రామస్తులు
- వాహనాలు సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు





ఆదినిమ్మాయపల్లె డ్యాం వద్ద ఇసుకాసురులు చేసిన గుంత, హిటాచీతో ఇసుకను తోడుతున్న దృశ్యం

కడప (క్రైం), మార్చి 26 : ఇసుక అక్రమాలను అడ్డుకోలేకపోతున్నారు. ఇష్టానుసారంగా అడ్డదిడ్డంగా ఇసుకను తోలేస్తున్నారు. క్వారీకి అనుమతులు లేకపోయినా కూడా యథేచ్ఛగా హిటాచీలు పెట్టి టిప్పర్లు, ట్రాక్టర్లతో తోలుతున్నారు. ఎన్నికల కోడ్ రావడంతో అధికారులు అక్రమ రవాణాపై దృష్టి సారించరన్న ఉద్దేశ్యంతో రాత్రి పగలు తేడా లేకుండా ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఆదినిమ్మాయపల్లె డ్యాం వద్ద రెండు హిటాచీలతో ఇసుకను టిప్పర్లు, ట్రాక్టర్లు ద్వారా రవాణా చేస్తుండడంతో ఆర్సీయం పార్టీ నేత రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం అడ్డుకుని కడప ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. దీంతో వల్లూరు ఆర్ఐ ఆధ్వర్యంలో అక్కడికి చేరుకుని టిప్పర్లు, హిటాచీలను అధికారులు సీజ్ చేశారు. అక్కడున్న ట్రాక్టర్లను కూడా సీజ్ చేశారు. దీనిపై రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ.. టిప్పర్లు, ట్రాక్టర్లతో ఇసుక తోలుతుంటే వాటిని వారం క్రితం అడ్డుకున్నామన్నారు. అనుమతులు ఉన్నాయని చెప్పడంతో ఇసుక రవాణాపై వల్లూరు తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశామన్నారు. అనుమతులు లేకుంటే అడ్డుకుంటామని తహశీల్దార్ చెప్పినా ఇసుక రవాణా ఆగలేదన్నారు. దీంతో మంగళవారం స్థానికులతో కలిసి వాహనాలు అడ్డుకుని ఆర్డీవోకు ఫిర్యాదు చేశామన్నారు. దీంతో రెవెన్యూ అధికారులు వాటిని సీజ్ చేశారని తెలిపారు. ఆదినిమ్మాయపల్లె డ్యాం వద్ద ఆసుక క్వారీలకు అనుమతిలేకపోయినా ఇక్కడ ఇష్టానుసారంగా తోలుతున్నారని అన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో ఇంటింటా సంక్షేమం

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి ● 90 కుటుంబాలు టీడీపీలో చేరిక



పుత్తా నరసింహారెడ్డి సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన దృశ్యం

పెండ్లిమర్రి, మార్చి 26: వచ్చే ఎన్నికల్లో గెలిచి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ప్రవేశపెట్టే సూపర్ సిక్స్ పథకాలతో ఇంటింటా సంక్షేమం ఏర్పడుతుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గంగనపల్లె,కొత్తగిరియంపల్లె పంచాయతీలలో యువనాయకుడు పుత్తా చైతన్యరెడ్డితో కలిసి బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోని వివరించారు. తల్లికి వందనం, దీపం పథకం, ఆడబిడ్డ నిధి, రైతు నిధి, యువగళం, నిరుద్యోగ భృతి తదితర పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంగిరెడ్డి, కిషోర్‌రెడ్డి, రాజారెడ్డి, శంకర్‌రెడ్డి, నాగమల్లారెడ్డి, నాగభూషణరెడ్డి, ఓబుల్‌రెడ్డి, ఉమాశంకర్‌రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, చంద్ర ఓబుళరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామాంజనేయులు, రఘునాథరెడ్డి, సారథిరెడ్డి, అరవేటి చంద్రారెడ్డి, నారాయణరెడ్డి, అయ్యవారురెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి 90 కుటుంబాలు చేరిక

కొత్త గిరియంపల్లె, గంగనపల్లె పంచాయతీలలో వైసీపీ నుంచి టీడీపీలోకి పుత్తా నరసింహారెడ్డి సమక్షంలో 90 కుటుంబాలు చేరాయి. గంగనపల్లెలో 12కుటుంబాలు, వడ్డవాండ్లపల్లెలో మూడు కుటుంబాలు, మల్లాయపల్లెలో 75 కుటుంబాలు చేరాయి. వీరికి పుత్తా నరసింహారెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సింగపూర్ రాజారెడ్డి, శంకర్‌రెడ్డి, నాగమల్లారెడ్డి, ఉమాశంకర్‌రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సమగ్రాభివృద్ధి

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి



బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, మాధవీరెడ్డి తదితరులు

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 26 : చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి తెలిపారు. మంగళవారం కడప నగరం 12వ డివిజను శ్రీనివాస విద్యాలయం సందు కాలనీలో టీడీపీ, జనసేన, బీజేపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ కరపత్రాలు అందించారు. పార్టీ అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఒక్క అవకాశం ఇచ్చి టీడీపీని గెలిపిస్తే ప్రతి నిరుపేద, మధ్య తరగతి వారికి న్యాయం జరుగుతుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ టీడీపీకి ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటరు రాజగోపాల్‌రెడ్డి, టీడీపీ నాయకులు జియావుద్దీన్, శివకొండారెడ్డి, నబీకోట శ్రీనివాసులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజల చూపు తెలుగుదేశం పార్టీ వైపు: బీటెక్ రవి

పులివెందుల, మార్చి 26: ప్రజల చూపు టీడీపీ వైపే ఉందని, వైసీపీ ఎన్ని కుంత్రాలు చేసినా భవిష్యత్తు టీడీపీదేనని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవి పేర్కొన్నారు. మంగళవారం లింగాల మండలం కామసముద్రం గ్రామానికి చెందిన తామటం సూర్యనారాయణరెడ్డి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పులివెందుల టీడీపీ కార్యాలయంలో ఆయనకు బీటెక్ రవి కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ ఒక్కచాన్స్ అంటూ ప్రజలను అభ్యర్థించి అధికారంలోకి వచ్చిన జగన్ ఆ తర్వాత ప్రజల గోడు పట్టించుకోలేదన్నారు. బటన్ నొక్కడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారనే భ్రమలో జగన్ ఉన్నారని, ప్రజల్లోకి వచ్చి వారి కష్టసుఖాలు తెలుసుకున్న పాపాన పోలేదన్నారు. ధరలు ఇంతలా ఎందుకు పెరిగాయో తెలుసుకున్న ప్రజలు వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సంక్షేమం-అభివృద్ధి రెండు కళ్లలా భావించి పాలన అందించే చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లింగాల మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.



సూర్యనారాయణరెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీటెక్ రవి

ఖైదీలు ఉచిత న్యాయ సహాయం పొందవచ్చు

● సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్



ఖైదీలతో మాట్లాడుతున్న సివిల్ జడ్జి బాబాఫకృద్దీన్

కడప (క్రైం), మార్చి 26 : కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీల కుటుంబ సభ్యుల కోసం ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రయోజనాలు పొందేందుకు న్యాయ సలహాలు, సహాయం అందిస్తామని ఈ అవకాశాన్ని ఖైదీ లు వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్.బాబా ఫకృద్దీన్ అన్నారు. మంగళవారం కడప కేంద్ర కారాగారంలో పురుష ఖైదీల డార్మిటరీలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉచిత న్యా యసహాయం, రక్షణ సలహా వ్యవస్థ పారాలీగల్ వలంటరీ, విధివిధినాలపై ఖైదీలకు వివరించారు. ఏదైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవా అధికార సంస్థను సంప్రదించవచ్చని అన్నారు. అర్జీల రూపంలో తీసుకునే లీగల్ ఎయిడెడ్, డిఫెన్స్ కౌన్సెలింగ్ సిస్టం ద్వారా సేవాధికారి సంస్థకు అర్జీలను పంపిస్తామన్నారు. అనంతరం ఖైదీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మహిళా ఖైదీ కారాగారాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సెంట్రల్ జైలు ఇన్‌చార్జ్ డిప్యూటీ సూపరింటెండెం ట్లు జవహర్‌బాబు, వైద్యాధికారి రమేష్, మహిళా జైల్ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రచారంలో స్టాఫ్ నర్సు

(కడప - ఆంధ్రజ్యోతి): బద్వేలులోని సీహెచ్‌సీలో పనిచేస్తున్న స్టాఫ్ నర్సు కె.శోభా కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథరెడ్డి ప్రచారంలో పాల్గొనడం చర్చనీయాంశంగా మా రింది. ఈ నెల 16న మధ్యాహ్నం ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ప్రభుత్వ ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు, వలంటీర్లు రాజకీయ ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనకూడదని ఈసీ ఆదేశాలు జారీ చేసింది. ఈసీ నిబంధనలు ఉల్లంఘించి ప్రచారంలో పాల్గొన్న వారిపై ఇప్పటికే వేటు వేశారు. అయినా కొంత మందిలో మార్పు రావడంలేదు. మూడు రోజుల క్రితం కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి అంగడివీధిలో నిర్వహించిన ప్రచారంలో స్టాఫ్ నర్సు పాల్గొన్నారు.



కడప అంగడివీధిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న స్టాఫ్ నర్సు శోభా (ఇన్‌సెట్‌లో) (ఫైల్)

అభిమానులే నా బలం

● ఆత్మీయ సభలో సాయినాథశర్మ

కమలాపురం రూరల్, మార్చి 26 : అభిమానులే తన బలమని టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి కాశీభట్ల సత్య సాయినాథశర్మ తెలిపారు. మంగళవారం పెద్దచెప్పలిలో ఆయన అభిమానులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీని నమ్ముకుని ఇన్ని రోజులు పనిచేశానన్నారు. మీరందరూ ఇన్ని రోజులు తనకు సపోర్టుగా నిలిచారని రాబోవు రోజుల్లో కూడా అందరి అభిమానం ఇలానే ఉండాలన్నారు. తాను టీడీపీకి రాజీనామా చేస్తున్నానని అన్నారు. రాజీనామా పత్రాన్ని జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుకు పంపిస్తున్నాన న్నారు. రేపటి నుంచి కొత్త ఉత్సాహంతో పయనిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్యం, మణికంఠశర్మ, నాగరాజాచారి, వెంకటేశ్వర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ అతిక్రమిస్తే కేసు: సీఐ

మైలవరం, మార్చి 26: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అతిక్రమిస్తే కేసు నమోదు చేస్తామని జమ్మలమడుగు రూరల్ సీఐ గోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దొమ్మరనంద్యాల, వేపరాల, మైలవరం గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సంద ర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలు ప్రశాంతవా తావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలన్నారు. మైలవరం ఎస్ఐ రెడ్డి సురేష్, ఏఎస్ఐ ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆత్మహత్య చేసుకున్న కుటుంబాన్ని ఆదుకోవాలి

● బీసీ సంక్షేమ సంఘం జిల్లా నేతల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కడప (మారుతీనగర్), మార్చి 26: వైసీపీ నాయకుల భూ దాహానికి ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరం గ్రామ బలహీన వర్గానికి చెందిన చేనేత పాల సుబ్బారావు కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తల లింగమూర్తి, ఉపాధ్యక్షుడు కళ్యా సుధాకర్, రామాజంనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు కొత్తమాధవరం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.15 వేల ఆర్థిక సాయంగా అందజేశారు. అనంతరం కడప ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పాలకులకు రెవెన్యూ అధికారులు తొత్తులుగా మారడంతోనే ఆ కుటుంబం ఆత్మహత్యకు పాల్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాల సుబ్బారావు మృతికి కారకులైన రెవెన్యూ అధికారులు, భూ బకాసురులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన భార్య పద్మావతి, కుమార్తె వినయ డిమాండ్ చేశారు. మృతుడి పెద్ద కుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు. ఆ 3.10 ఎకరాల భూమి తిరిగి వారికే దక్కేలా చేయడంతో పాటు రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేయాలని, లేదంటే వారి కుటుంబానికి న్యాయం జరిగేవరకు అండగా పోరు సాగిస్తామన్నారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ గోవిందునాగరాజు, ప్రధాన కార్యదర్శి త్రివిక్రమ్‌రావు, నాయకులు సుబ్బారావు, ఆదినారాయణ, నరసింహ, సంటెన్న, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆధ్వర్యంలో న్యాయ విచారణ జరిపించాలి



వినతి పత్రం అందిస్తున్న నాయకులు

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 26 : మాధవరంలో భూ సమస్య కారణంగా ముగ్గురు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనపై న్యాయ విచారణ కలెక్టరు ఆధ్వర్యంలో జరగాలని మంగళవారం కలెక్టరేట్ జిల్లా రెవెన్యూ అధికారికి ప్రజాసంఘాలు వినతిపత్రాలు అందించారు. సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు చంద్ర, చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ ఒంటిమిట్ట మండలం మాధవరంలో చేనేత కుటుంబం ఆత్మహత్యకు కారకులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్వో గంగాధర్‌గౌడ్‌కు వినతిపత్రం అందించారు.

అంగన్వాడీ పీడీపై విచారణ జరిపించాలి: సీఐటీయూ

కడప (నాగరాజుపేట), మార్చి 26 : కడప జిల్లా ఐసీడీఎస్ అంగన్వాడీ పీడీ శ్రీలక్ష్మిపై విచారణ జరిపించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం తమ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. అంగన్వాడీ కార్యకర్తల నుంచి రూ.3వేలు డబ్బు తీసుకున్నారన్న విషయంపై మంగళవారం రీజనల్ జాయింట్ డైరెక్టరు విచారణ చేశారన్నారు. ఈ విచారణ అంగన్వాడీ నాయకులు, కార్యకర్తలకు తెలియకుండా తూతూ మంత్రంగా చేయడం వెనక మర్మం ఏమిటని ప్రశ్నించారు. ఆర్‌జేడీ పీడీకి వత్తాసు పలుకుతూ ఈ డిపార్ట్‌మెంటు నాది కాదని, నాకు ఈ విషయాలే తెలియవని చెబుతున్నారని, ఈ విచారణ పక్కదోవ పట్టించడం దుర్మార్గమన్నారు. తక్షణం శ్రీలక్ష్మిని ప్రభుత్వానికి సరెండర్ చేసి ఆర్‌జేడీ చేసిన విచారణను పరిగణనలోకి తీసుకోకుండా జ్యుడిషియల్ ఎంక్వయిరీ జరిపి నిజాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

1 నుంచి ఉచిత డ్రైవింగ్ శిక్షణ

వేంపల్లె, మార్చి 26: వచ్చేనెల 1వ తేదీ నుంచి వివేక్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో కందుల శివానందరెడ్డి పేరిట ఉచిత డ్రైవింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు సొసైటీ అధ్యక్షురాలు జ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 25ఏళ్లలోపు గల నిరుద్యోగ యువతీ, యువకులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈనెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

'అర్చకులపై దాడి తగదు'

వేంపల్లె, మార్చి 26: కాకినాడ శివాలయంలో అభిషేకం సరిగా చేయలేదంటూ అర్చకులపై వైసీపీ నేత దాడి చేయడం తగదని అఖిల భారతీయ బ్రాహ్మణ మహా సంఘ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ఇంద్రకంటి ప్రసాద్‌శర్మ సిద్ధాంతి పేర్కొన్నారు. మంగళవారం ఆయన వేంపల్లెలో విలేకరులతో మాట్లాడుతూ దేవాలయాల్లో అర్చక పాత్ర చాలా కీలకమైనదని, అర్చకులను భగవత్ స్వరూపులుగా భక్తులు నమ్ముతారన్నారు. భక్తుల బాగోగులు భగవంతునికి చేరవేసి వారి సమస్యలు తొలగిపోవాలని అర్చకులతో పూజలు నిర్వహిస్తూ ఉంటారన్నారు. అర్చకుల కాళ్లు మొక్కే సంప్రదాయం హిందువులకు ఉందన్నారు. అర్చకులపై దాడి చేసిన మాజీ కార్పొరేటర్ చంద్రరావుపై చర్యలు తీసుకోవడంతో పాటు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

అర్చకులపై దాడి దుర్మార్గం: శ్రీరాములు

కడప(కలెక్టరేట్) మార్చి 26: కాకినాడలోని పురోహితం చేసే అర్చకులు సాయిశర్మ, విజయకుమార్ శర్మలపై అధికార పార్టీకి చెందిన నేతలు అతి కిరాతకంగా దాడులు చేయడం దుర్మార్గమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు మంగళవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్చకులపై దాడులు చేసిన అధికార పార్టీనేతలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో బీసీలు, బ్రాహ్మణులు, అణగారిన కులాలు ఏకమై అరాచక పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రిని గద్దెదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చక్రాయపేట, మార్చి 26: మండలంలోని మహదేవపల్లె, కె.రాజుపల్లె, కె.ఎర్రగుడి సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న గ్రామాలలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈఈ ప్రవీణ్‌కుమార్‌యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలు





ప్రత్యేక అలంకరణలో విజయదుర్గాదేవి... రాహుకాల పూజలు నిర్వహిస్తున్న మహిళలు

కడప (కల్చరల్), మార్చి 26: కడప నగరం బిల్టప్ సర్కిల్ సమీపంలోని విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు ఘనం గా నిర్విహించారు. జిల్లా నలుమూలల నుంచి పలువురు మహిళలు హాజరై అమ్మవారి సన్నిధిలో నిమ్మకాయలతో కూడిన రాహుకాల దీపాలను భక్తిశ్రద్ధలతో వెలిగించి ఆ తల్లి శరణు కోరారు. దీంతో అమ్మవారి ఆలయం దీపాలంకరణతో నిండిపోయింది.

వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడుదాం

● కడప జన సైనికుల ఆత్మీయ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 26 : వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పా డుదాం అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి పిలుపు నిచ్చారు. మంగళ వారం జనసేన పార్టీ రాయలసీమ ఎన్నికల కార్యక్రమాల కమిటీ కోకన్వీనరు పంద్రా రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో కడప జన సైనికుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు జనసేన పార్టీ ఓట్లన్నీ జనసేన, టీడీపీ, బీజేపీ బలప రిచిన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డికి వేసే విధంగా ప్రతి జన సైనికుడు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలని మూడు పార్టీలు కలిశాయన్నారు. 2014లో జనసేన, టీడీపీ పొత్తు ఉండేదని, ఇప్పుడు కడపలో టీడీపీ అభ్యర్థి మాధవీరెడ్డి గెలుపునకు ప్రతి జనసేన కార్యకర్తా ఇంటింటికీ వెళ్లి కష్టపడి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, జనసేన నాయకులు తుంగా రమణయ్య, అబ్బన్నగారి రాజగోపాల్, సాయిక్రిష్ణఆచారి, రాజశేఖర్, బాలునాక్, కుమార్‌నాయక్, మనీ, సాయిస్వరూప్, సిద్దార్ధ, తోట సుమన్, లోకేశ్, సద్దాం, రామక్రిష్ణ, దేవకుమార్, వంశిక్రిష్ణ, టీడీపీ నాయకులు బండి బాబు, బీజేపీ నాయకుడు చలపతి తదితరులు పాల్గొన్నారు.

బాలల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ సునీత

వేంపల్లె, మార్చి 26: ప్రతి అంగన్వాడీ కార్యకర్త బాలల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వేంపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సునీత అన్నారు. మంగళవారం వేంపల్లెలో వేంపల్లె, చక్రాయపేట మండలాల అంగన్వాడీలకు భేటి బచావో భేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆడపిల్లల జనాన్ని ప్రోత్సహించాలని, గర్భస్థ శిశులింగ నిర్ధారణ పరీక్షల చేయించుకున్న, చేసిన వారు శిక్షార్హులు అవుతారని తెలిపారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ మహేష్, అంగన్వాడీ సూపర్వైజర్లు డాక్టర్ స్వర్ణలత, సుభాషిణి, అంగన్వాడీ పాల్గొన్నారు.

నీటి సమస్యపై సత్వర పరిష్కారం

● కాల్ సెంటరు నెం.99490 93772 ● కమిషనర్ ప్రవీణ్‌చంద్



అధికారులకు సూచనలు ఇస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 26 : కడప నగరపాలక సంస్థ పరిధిలో నీటి సమస్యపై కాల్ సెంటరు నెం.99490 93772కు తెలిపితే సత్వరం పరిష్కారం జరుగుతుందని కమిషనర్ ప్రవీణ్‌చంద్ తెలిపారు. మంగళవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా అన్నమయ్య జంక్షన్, క్రిష్ణాసర్కిల్, గోకుల్ జంక్షన్, దేవునికడప, మాచుపల్లె జంక్షన్, అల్మాస్‌పేట్, వినాయకనగర్ ప్రాంతాలను ఆయన ఆర్‌అండ్‌బి అధికారులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, శానిటేషన్‌అధికారులతో కలిసి పరిశీలించారు. అధికారులకు అభివృద్ధి పనుల నిర్మాణంపై తగు సూచనలు అందించారు. అలాగే సత్వరం నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు, ఆర్‌అండ్‌బి అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ ఎత్తివేత



మాట్లాడుతున్న శ్రీనివాసులరెడ్డి

పులివెందుల టౌన్, మార్చి 26: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులు వ్యవసాయానికి కొనుగోలు చేసే పరికరాలపై జీఎస్టీని పూర్తి తీసివేస్తామని పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాసులరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులకు వారు పండించిన పంటకి అదనంగా 50శాతం మద్దతు ధర వచ్చే విధంగా చట్టం తీసుకువస్తామని, రైతులకు రుణమాఫీ చేసే విధంగా ఒక కమీషన్ వేస్తామన్నారు. దేశంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న 30లక్షల ఉద్యోగాలను అధికారంలోకి రాగానే భర్తీచేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్, మహేంద్ర పాల్గొన్నారు.

మూల్యాంకన కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

● డీఈఓకు ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం వినతి



డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 26 : పదో తరగతి మూల్యాంకన కేంద్రంలో మౌళిక వసతులు కల్పించాలని ఎస్సీఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున డిమాండ్ చేశారు. మంగళవారం డీఈవో కార్యాలయంలో డీఈవో అనురాధకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి దృష్టిలో ఉంచుకుని మూల్యాంకనలో పాల్గొన్న ఉపాధ్యాయులకు వసతులు కల్పించాలని కోరారు. అలాగే కొంత మందికి గత ఏడాదికి సంబంధించి రెమ్యునరేషన్ రాలేదని చెల్లించాలని కోరారు. ప్రస్తుతం మూల్యాంకన విధుల్లో పాల్గొనే విద్యార్థులకు మొదటిప్రాధాన్యత కల్పించి రెమ్యునరేషన్ ఇవ్వడంతో, అలాగే ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ ప్రెసిడెంటు శేషగిరిరావు, జిల్లా అధ్యక్షులు గంగరాజు, జిల్లాకార్యదర్శి సురేంద్ర పాల్గొన్నారు.

నేటి నుంచి వైవీయూ మార్నింగ్ తరగతులు

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 26 : వైవీయూ పీజీ కళాశాల తరగతులు బుధవారం నుంచి ఒంటిపూట తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ప్రొఫెసరు ఎస్.రఘునాథరెడ్డి తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు తరగతులు ఉంటాయన్నారు. వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా విద్యార్థుల సౌకర్యార్థం ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. బోధనేతర సిబ్బంది యదావిధిగా ఉదయం 10గంల నుండి సాయంత్రం 5 వరకు పనివేళలుంటాయని స్పష్టం చేశారు.

మైదుకూరుకు తాగునీటి గండం

● అడుగంటిన భూగర్భజలాలు ● నీటి సరఫరాకు జీవో ఉన్నా ఫలితం శూన్యం ● ఇది అధికారుల నిర్లక్ష్యమంటున్న జనం

మైదుకూరు, మార్చి 26 : మైదుకూరు మున్సిపాలిటీకి భూగర్భజలాలు అడుగంటడంతో తాగునీటి గండం పొంచి ఉంది. ఇప్పటికే పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మైదుకూరుకు పెద్ద దిక్కుగా ఉన్న ఎర్రచెరువుకు తెలుగుగంగ సబ్సిడరీ రిజర్వాయర్ నుంచి నీటిని తెచ్చుకునేందుకు టీడీపీ ప్రభుత్వంలో ప్రత్యేక జీవో ఉన్నా అధికారుల నిర్లక్ష్యం ప్రజా ప్రతినిధుల వైఫల్యంతో ఫలితం లేకుండా పోయింది. నీటి ట్యాంకర్ల కోసం ప్రజలు రాత్రింబవళ్ళు పడిగాపులు కాస్తున్నారు. పైగా రంజాన్ మాసం కావడంతో ముస్లింలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 8 ఏళ్ళ క్రితం మైదుకూరు పట్టణంలో ఇలాగే భూగర్భ జలాలు అడుగంటడంతో అప్పట్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేశారు. రాజకీయాల్లో కొత్తగా వచ్చిన పుట్టా సుధాకర్ యాదవ్ పరిస్థితిని గమనించి స్వంత నిధులతో వందలాది ట్యాంకర్లతో నీటిని ప్రజలకు అందించారు. అంతేగాక 0.011 టీఎంసీలు నీటి నిల్వ సామర్థ్యం ఉన్న ఎర్రచెరువుకు మండలంలోని తెలుగుగంగ సబ్సిడరీ రిజర్వాయర్


సాయినాథపురంలోని కేసీనగర్‌లో ట్యాంకర్ల వద్ద నీటిని పట్టుకుంటున్న స్థానికులు

ద్వారా నీటిని నింపేందుకు, అప్పటి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుక పోయి సమీపంలోని తెలుగు గంగ సబ్సిడరీ రిజర్వాయర్ నుంచి గోడేరు వంక ద్వారా ఎర్రచెరువులో నీళ్ళు నింపేలా శాశ్వత జీవో తీసుక రావడంతో అప్పటి నుంచి మైదుకూరు పట్టణంలో నీటి కొరత లేకుండా ఉండేది.మండలంలోని పలు చెరువులకు నీళ్ళు నింపేస్తుండటంతో నీరు లభ్యమయ్యేది. అయితే ఈ ఏడాది అధికారులు ముందుచూపు లేక, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యంతో ఎర్రచెరువుకు నీటిని నింపలేదు. దీంతో మైదుకూరు పట్టణంలో నీటి ఎద్దడి నెలకొంది. వేసవి ఆరంభంలోనే భూగర్భ జలాలు నిండుకొని నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాయినాథపురంలోని పలు వీధుల్లో కనీసం తాగునీటికి కూడా కష్టంగా ఉంది. మున్సిపల్ అధికారులు తూతూ మంత్రంగా ట్యాంకర్లు పంపుతున్నా అందరికీ తగినంత నీరు అందడం లేదు. పైగా రంజాన్ మాసం కావడంతో ముస్లింలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

'శాశ్వత పరిష్కారం చూపే వారికే మా ఓట్లు'

పుట్టా సుధాకర్‌యాదవ్ పుణ్యంతో 8 ఏళ్ళ నుంచి నీటికి ఇబ్బందులు పడలేదు. కానీ ఇప్పుడు మళ్ళీ ఆపరిస్థితి దాపురించింది. కనీసం తాగేందుకు నీళ్ళు లేక రాత్రింబవళ్ళు ఇబ్బందులు పడుతున్నాం. నీటి నివారణకు శాశ్విత చర్యలు చేపట్టే వారికే తామూ ఓట్లువేస్తామంటూ ఖాళీ బిందెలతో మహిళలు మంగళవారం మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. 10 రోజులుగా నీటి కోసం ఇబ్బందులు పడు తున్నాం. రోడ్లపై బైఠాయించి ఆందోళన చేపడితే ట్యాంకర్లు పంపారు. అయితే అవి ఏమాత్రం సరిపోవడం లేదంటూ సాయినాథ పురంలోని మహిళలు పెద్ద ఎత్తున మున్సిపల్ కార్యాలయాన్ని చుట్టుముట్టారు. నీటి కొరత లేకుండా చూడాలని, మా ప్రాంతంలో బోర్లు వేస్తామంటూ టీడీపీ వారు వచ్చారని అయితే ఎన్నికల కోడ్ ఉండటంతో అనుమతి లేదంటూ చెప్పుకొస్తున్నారు.


మున్సిపల్ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న సాయినాథపురంలోని 11, 12 వార్డుల మహిళలు

అధికారులు బోర్లు వేయిస్తారా లేక టీడీపీ వారికి అనుమతి ఇస్తారా అంటూ అధికారులను నిలదీశారు. దీంతో ఈ సమస్యపై కలెక్టర్ దృష్టికి తీసుకపోతామని అధికారులు పేర్కొనడంతో మహిళలు వెనుదిరిగారు.

జై భీమ్ పార్టీ అభ్యర్థిగా కరుణాకర్‌యాదవ్

ప్రొద్దుటూరు, మార్చి 26 : ప్రొద్దుటూరు జై భీమ్‌పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి తనగానీ కరుణాకర్ యాదవ్‌ను ప్రకటించారు. ఆ మేరకు ఆ పార్టీ అధ్యక్షుడు జడ శ్రావణ్ కుమార్ ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితా విడుదల చేశారు. తనకు జైభీమ్ పార్టీ టికెట్టు ఇవ్వడంపై కరుణాకర్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. పార్టీ ని గెలిపించడం కోసం పనిచేస్తానని, బహుజన రాజ్యాధికారం లక్ష్యంగా ఎన్నికల్లో ప్రచారం చేస్తామని తెలిపారు.

ఎన్నికల కోడ్ అతిక్రమిస్తే కేసు

మైలవరం, మార్చి 26: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అతిక్రమిస్తే కేసు నమోదు చేస్తామని జమ్మలమడుగు రూరల్ సీఐ గోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దొమ్మరనంద్యాల, వేపరాల, మైలవరం గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ మాట్లాడుతూ ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం ఎస్‌ఐ రెడ్డి సురేష్, ఎఎస్‌ఐ అంజనేయులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

కొండాపురం,మార్చి 26: మండలంలోని డొంకపల్లె గ్రామం వద్ద మంగళవారం పోలీసులు 9 మంది జూదరులను అరెస్టు చేశారు. గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్న 9 మంది నుంచి రూ.13,300 స్వాధీనపరుచుకున్నారు. వీరిని కోర్టుకు హాజరు పరచనున్నట్లు కొండాపురం ఎస్‌ఐ యోగీంద్ర తెలిపారు.

17 మద్యం బాటిళ్లు స్వాధీనం..: మండల కేంద్రమైన కొండాపురం గ్రామంలో 14 బీరు బాటిళ్లను,3 మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మహేశ్వరరెడ్డి అనే వ్యక్తి మద్యం బాటిళ్లను అనుమతి లేకుండా అధిక ధరలకు అమ్మడానికి తీసుకెళుతుండగా వాటిని స్వాధీనం చేసుకున్నారు.కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ యోగీంద్ర తెలిపారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు

పోరుమామిళ్ల, మార్చి 26 : ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు శిరీషా, డిప్యూటీ తహసీల్దారు సంజీవ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం రంగసముద్రం పంచాయతీ పరిధిలోని 1008/2ఎ1, 2సీ, 2సీ5, అగ్నిమాపక కేంద్రం సమీపంలో ఉన్న సర్వే నెం.1009/ఎ1, ఎ3లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ స్థలాలకు సంబంధించి కొనుగోలు, అమ్మకాలు చేయడం, ఆక్రమాలకు పాల్పడడం చట్టవిరుద్ధమని అలా ఎవరైనా చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో ఓబయ్య పాల్గొన్నారు.

కార్మికులను గౌరవించాలి

పోరుమామిళ్ల, మార్చి 26 : పంచాయతీ కార్మికులను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రంగసముద్రం సర్పంచ్ చిత్తారవి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. పోరుమామిళ్ల మండలంలోని రంగస ముద్రం పంచాయతీ పరిధిలో నివాసం ఉంటున్న దేశాయి వెంకటచలపతిరెడ్డి మంగళవారం రంగసముద్రం పంచాయతీ హరితరాయబారి ప్రేమ్ కుమార్‌ను హుకుం జారీ చేసి కొట్టాడని పంచాయతీ కార్మికులు సర్పంచ్ చిత్తారవిప్రకాశ్‌రెడ్డి, పంచాతీ కార్యదర్శి రాజీవ్ రెడ్డికి విన్నవించారు. తమకు న్యాయం జరగకపోతే మూకుమ్మడిగా రాజీనామా చేస్తామని వినతిపత్రం సమర్పించారు. ఇందుకు స్పందించిన ఆయన మాట్లాడుతూ పంచా యతీ సిబ్బందిపై చేయి చేసుకోవడం సమంజసం కాదని తమ తప్పును సరిదిద్దుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లాకార్యదర్శి పిడుగుమస్తాన్ మాట్లాడుతూ రంగసముద్రం పంచాయతీలోని స్వచ్ఛ భారత్ కార్మికున్ని కొట్టి అసభ్య పదజాలంతో దూషించిన దేశాయి వెంకటచలపతిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు ప్రసాద్, గణేశ్, గోపన్న, మధు, లక్ష్మీదేవి, ఏసురత్నం పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబాన్ని ఆదుకుంటాం

కలసపాడు, మార్చి 26 : కలసపాడు పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు సగిలి మరియన్న (58) సోమవారం మరణించాడు. మరియన్న పోలీసు డిపార్ట్‌మెంటులో హోంగార్డుగా సుమారు 30సంవత్సరాలు పాటు తన సర్వీసును అందించారు. ఆయన కుటుంబాన్ని పోలీసుశాఖ అన్ని విధాల ఆదుకుంటుందని ఎస్పీ పేర్కొన్నారు. ఆ మేరకు మంగళవారం మరణించిన హోంగార్డు అంత్యక్రియల కోసం హోంగార్డు ఇన్‌చార్జి ఆర్ఐ శ్రీశైలంరెడ్డి, కలసపాడు ఎస్ఐ, సిబ్బంది అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కలసపాడు పోలీసు సిబ్బంది, పోరుమామిళ్ల సర్కిల్ పరిధిలో పనిచేసే సిబ్బంది, జిల్లాలో పనిచేసే సహచర హోంగార్డులు, గతంలో కలసపాడు పోలీసుస్టేషన్‌లో పనిచేసిన సిబ్బంది తరపున కూడా వారి కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు.

ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం

పోరుమామిళ్ల, మార్చి 26 : మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలో ఉన్న చెన్నకేశవస్వామి ఆలయ పునర్నిర్మాణం కోసం పాత దేవాలయాన్ని తొలగించి కొత్తగా నిర్మించడానికి పనులు ప్రారంభించారు. ఈ దేవాలయ నిర్మాణానికి తిరుమల తిరుపతి శ్రీవారి ట్రస్టు ద్వారా కోటీ 80 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఈ పనులకు సంబంధించి మంగళవారం యంత్రాలతో దేవాలయం పైపెచ్చులు పునాదులు, నిర్మాణాలు తొలగించే కార్యక్రమం చేపట్టారు.

టీడీపీ కౌన్సిలర్ శివజ్యోతి, కుతుబుద్దీన్‌పై సస్పెన్షన్ ఎత్తివేత

ప్రొద్దుటూరు, మార్చి 26 : టీడీపీ కౌన్సిలర్ గాజుల శివజ్యోతి ఆమె భర్త టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు చింతకుంట కుతుబుద్దీన్‌పై సస్పెన్షన్ ఎత్తివేస్తూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ప్రకటన విడుదల చేశారు. మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించాక ఆయన టీడీపీ కౌన్సిలర్ గాజుల శివజ్యోతి ఆమెభర్త చింతకుంట కుతుబుద్దీన్‌ల సేవలు పార్టీకి చాలా అవసరమని వారిపై వున్న సస్పెన్షన్ తక్షణం ఎత్తివేయాని ఆయన సిఫారస్సు చేశారు. ఆమేరకు మంగళవారం వారిపై సస్పెన్షన్ ఉత్తర్వులు ఎత్తివేస్తు ఉత్తర్వులు వెలువడ్డాయి.

బీజేపీ రాష్ట్ర నాయకులను కలిసిన బొజ్జా రోశన్న

బద్వేలు, మార్చి 26: బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి, జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్, రాష్ట్ర ఎన్నికల సహాయ ఇన్‌చార్జి సిద్ధార్థ్ సింగ్, రాష్ట్ర అధ్యక్షురాలు పురందరేశ్వరిని మంగళవారం బద్వేలు నియోజకవర్గ విశ్రాంత ఇంజనీరు రోశన్న విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న శాసనసభ ఎన్నికలలో బద్వేలు అసెంబ్లీ టికెట్ తనకు కేటాయించాలని కోరినట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలో తనకున్న పరిచయాలు, నరేంద్రమోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పాలనకు ఆకర్షితుడనై బీజేపీలో చేరినట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వంగళ శశిభూషణ్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి వెంకటేశ్వర్‌రెడ్డి, కడప పార్లమెంటు కన్వీనర్ బొమ్మనసుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో టీడీపీ జెండా ఎగురవేద్దాం

రాచమల్లుకు రాజకీయ సమాధికడతాం ● నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు , మార్చి 26 : ప్రొద్దుటూరులో వైసీపీ అరాచకపాలనను అంతం చేసి ప్రజా కంఠకుడుగా మారిన రాచమల్లు ప్రసాద్‌రెడ్డిని ఓడించడానికి, టీడీపీ జెండాను ఎగురవేయడం కోసం అందరం కలిసి పాటుపడుదామని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఇస్లాంపురం వీధిలోని మున్సిపల్ మాజీ ఇన్‌చార్జ్ చైర్మెన్ వీఎస్ ముక్తియార్ స్వగృహానికి వరదరాజులరెడ్డి వెళ్ళి కలిశారు. అ సందర్భంగా ముక్తియార్ ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో వరదరాజులరెడ్డి మాట్లాడు తూ నేడు వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఎన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో అవినీతి, భూదందాలు, హత్యారాజకీయాలు పెరిగిపోయాయన్నారు. ప్రొద్దుటూరులో రాచమల్లు ప్రసాద్‌రెడ్డి చేయని అవినీతి, అక్రమాలు, ఆగడాలు, భూదందాలు లేవన్నారు. వందల కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదించి టీడీపీని భూస్థాపితం చేస్తానని శపథం చేశాడన్నారు. అందువల్లే రాబోవు ఎన్నికల్లో టీడీపీలోని నాయకులంతా ఏకమై రాచమల్లును రాజకీయ సమాధి చేయాలన్నారు. సీఎం సురేష్‌నాయుడు మాట్లాడుతూ టికెట్టు రాలేదని బాధవున్నా టికెట్టు వచ్చిన వరదరాజులరెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనఅందరిపై వుందన్నారు. ఈ సమావేశంలో అంజుమన్ మాజీ అధ్యక్షుడు ఇక్బాల్,


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

నంద్యాలకొండారెడ్డి,మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మునిసిపల్ మాజీ చైర్మెన్ ఆసం రఘురామిరెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈవీ సుధాకర్‌రెడ్డి ఇంటికి వెళ్లి కలిసిన వరద...: టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డిని హోమస్ పేటలోని ఆయన స్వగృహానికి వెళ్ళి మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి కలిశారు.ప్రొద్దుటూరులో టీడీపీ జెండా ఎగురవేయ డానికి కలిసి పనిచేద్దామని వరదరాజులరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో సీఎం సురేష్ నాయుడు, వీఎస్ ముక్తియార్, కొండారెడ్డి, బచ్చలపుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

మరోసారి మోసం చేయడానికే జగన్ సంసిద్ధం సభలు

ప్రొద్దుటూరు, మార్చి 26 : రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేయడానికే జగన్‌సంసిద్ధం సభలు జరుపుతున్నారని టీడీపీ యువత రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు ఆరోపించారు. మంగళవారం పీఎస్‌ఆర్ కాంప్లెక్స్ లోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ప్రతి ఏడాది నిరుద్యోగ యువతకు జాబ్‌క్యాలండ్ అనిచెప్పి ఓటేయించున్న జగన్ నిరుద్యోగులను మోసం చేసినందుకు నీకు మళ్ళీ ఓటేయ్యాలనా అని విమర్శించారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసినందుకు ఓటేయాలనా అని నిలదీశారు. జగన్‌కు ఓటమి భయం పట్టుకుంది కాబట్టే ఆగమేఘాల మీద బస్సు యాత్రను చేపడుతున్నారన్నారు. ఇన్నాళ్ళు తాడే పల్లి ప్యాలెస్ దాటి రాని జగన్ నేడు ఓటు కోసం బస్సు యాత్ర పేర వస్తే ఎవ్వరూ విశ్వసించరన్నారు.సమావేశంలో అల్లా, సాయిరాం, గోలే , జనసేన వంశీ పాల్గొన్నారు.

మెడికల్ డ్రగ్గిస్ట్ అండ్ కెమిస్ట్ అసోసియేషన్ బద్వేలు టౌన్ అధ్యక్షుడిగా రాధాక్రిష్ణమూర్తి

బద్వేలు టౌన్, మార్చి 26 : మెడికల్ అండ్ డ్రగ్గిస్ట్, కెమిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాధాక్రిష్ణమూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా ఆ సంఘం అసోసియేషన్ అధ్యక్షుడు రమణమూర్తి తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఆ అసోసియేషన్ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో మెడికల్ షాపుల సమస్యలపై గతంలో మాదిరిగానే అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అనంతరం రాధాక్రిష్ణమూర్తి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఏజన్సీలు, యజమానులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

వరదరాజులరెడ్డికి సంపూర్ణ మద్దతు

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శికోనేటి ప్రదీప్‌రెడ్డి


వరదరాజులరెడ్డికి సంపూర్ణ మద్దతు తెలియపరుస్తూ సన్మానిస్తున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యాదర్శి ప్రదీప్‌రెడ్డి

ప్రొద్దుటూరు,మార్చి 26: టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా ప్రొద్దుటూరు లో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డికి సంపూర్ణ మద్దతు ప్రకటించి ఆయనను గెలిపించడానికి బీజేపీ శక్తివంచనలేకుండా కృషి చేస్తుందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి ప్రదీప్‌రెడ్డి తెలిపారు. మంగళవారం బొల్లవరంలోని గోల్డన్ పార్కు ఫంక్షన్ హాలులో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి కోనేటి ప్రదీప్‌రెడ్డి ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రదీప్‌రెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరులో వరదరాజులరెడ్డి మార్కు రాజకీయం పట్ల ప్రజల్లో ఆమోదం వుందన్నారు. మూడు పార్టీల కూటమి అభ్యర్థిగా వరదరాజులరెడ్డిని గెలిపించుకోవడానికి బీజేపీ శ్రేణులంతా కలిసికట్టుగా పనిచేస్తాయన్నారు. టీడీపీ నాయకులు కొండారెడ్డి, రాజుపాళెం మాజీ జడ్పీటీసీ తోట మహేశ్వరరెడ్డి, చౌటపల్లె మాజీ సర్పంచ్ మార్తల ఈశ్వరమ్మ, లక్ష్మీరెడ్డి, బచ్చల ప్రతాప్, బీజేపీ అసెంబ్లీ కో-కన్వీనర్ గౌరీ శంకర్, మైనారిటీ మోర్చా మూల్లా అస్మత్, షకీలా బాను, బీజేపీ పట్టణ నాయకులు గురుప్రసాద్ రవి సుధాకర్‌రెడ్డి, విక్రాంత్ వరప్రసాద్‌రెడ్డి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమ కోసం ఉద్యమించాలి

పోరుమామిళ్ల, మార్చి 26 : జిల్లాలో ఉక్కు పరిశ్రమ కోసం నిరుద్యోగ యువతీ యువకులు ఉద్యమించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని అన్నారు. మంగళవారం పోరుమామిళ్లలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఉక్కుఏర్పాటైతే లక్షలాది నిరుద్యోగులకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. డీవైఎఫ్ఐ అధ్యక్షుడిగా రత్నమయ్య, మండల కార్యదర్శిగా సుందరయ్య, ఉపాధ్యక్షుడిగా రామయ్య, అనిల్, సహాయ కార్యదర్శులుగా కిరణ్, అష్రఫ్, ట్రెజరరుగా శివ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ఘనంగా ముగిసిన అంకాలమ్మ తల్లి తిరుణాల

బి.కోడూరు, మార్చి 26 : మండల పరిధిలోని మున్నెల్లి గ్రామంలో అంకాలమ్మ తల్లి పగలు తిరుణాల మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ అమ్మవారి తిరుణాలలో చెక్క భజనలు, కులుకు భజనలు, కోలాటం, బండలాగుడు పోటీలు మున్నెల్లి, బోడి గుండుపల్లె, తువ్వపల్లె గ్రామాల నుంచి సిరిమాన్లు అక్కడికి వచ్చి భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అలాగే కుంకుమ బండ్లు, భరతనాట్యం వివిధ రకాల కార్యక్రమాలు


అంకాలమ్మ తల్లి

ఘనంగా నిర్వహించారు. బండలాగుడు పోటీల్లో ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం కొండపేట గ్రామానికి చెందిన శ్రీనువాసులు ఎద్దులు మొదటి బహుమతి రూ.40,116 రాగా, రెండో బహుమతి నంద్యాల జిల్లా చాగలమర్రి మంలం మూడుర్లాళ్లపల్లె గ్రామానికి చెందిన చిన్న ఓబుల్‌రెడ్డిఎద్దులకు రూ.20,116 అందించారు. భక్తులకు టీడీపీ రాష్ట్ర రైతు విభాగ అధ్యక్షుడు రమణారెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిం చారు. బి.కోడూరు ఎస్ఐ జయరాములు తన సిబ్బందితో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు నిర్వహించారు.

పొట్టిపాడు యువకుడికి జేఎన్టీయూ డాక్టరేట్

కొండాపురం, మార్చి 26 :మండలంలోని పొట్టిపాడు గ్రామానికి చెందిన కుమ్మర నరేష్ అనే యువకుడికి అనంతపురం జేఎన్టీయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. యోగి వేమన యూనివర్సిటీ లో ఎం.ఎ ఇంగ్లీష్ పూర్తి చేసిన నరేష్ ప్రముఖ ఆంగ్ల రచయిత కె.వి.రఘుపతి రచనల్లోని ముఖ్యాంశాలపై పరిశోధన చేశారు. బెంగళూరు ప్రెసిడెన్సీ యూనివర్శిటీ ఇంగ్లీషు ఆచార్యులు జి.హంపమ్మ, జేఎన్టీయూ హుమానిటీస్ విభాగం ఆచార్యులు వి.బి.చిత్ర ,పద్మావతి మహిళా యూనివర్సిటీ ఇంగ్లీషు విభాగం ఆచార్యులు వైఎస్ శారద ఆధ్వర్యంలో జరిగిన మౌఖిక పరీక్ష అనంతరం నరేష్ కు డాక్టరేట్ ప్రకటించారు.సాధారణ కుటుంబం నుంచి వచ్చిన నరేష్ డాక్టరేట్ సాధించటం పట్ల పలువురు అభినందించారు.

నిరుపయోగంగా వాటర్ ట్యాంకు

జమ్మలమడుగు, మార్చి 26: జమ్మలమడుగు మండలంలోని మోరగుడి గ్రామం శ్రీరాముల పేట రంగునీళ్ల కాలువ పక్కన ఉన్న మంచినీళ్ల ట్యాంకు నిరుపయోగంగా మారింది. గ్రామంలో మంచినీటి సరఫరాకు నిర్మించారు. అయితే వాటర్‌ట్యాంకు శుభ్రం చేయకపోవడం, ట్యాంకుకు ఉన్న మెట్లు దెబ్బతినడం వలన నిరుపయోగంగా మారిందని స్థానికులు తెలిపారు. అయితే ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా మంచినీళ్ల ట్యాంకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



ఆక్రమణ కోసం ఏర్పాటైన షెడ్లు


రోడ్డు పక్కన వెలసిన షెడ్లు

జమ్మలమడుగు, మార్చి 26: జమ్మలమడుగు తాడిపత్రి రోడ్డులో విద్యుత్తు శాఖ కార్యాలయం ఎదురుగా ప్రధాన రోడ్డు పక్కన కొందరు రేకులు నిర్మించి షెడ్లు, దుకాణాలు వెలిశాయి. ఆ రోడ్డులో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. ఒకేసారి పెద్ద వాహనాలు వస్తే ద్విచక్ర వాహనాలు తప్పకుండా ఆగాల్సి ఉంటుంది. గతంలో రోడ్డు చివరకు ద్విక్ర వాహనదారులు వెళ్లేవారు. ప్రస్తుతం ఆక్రమణల దిశగా షెడ్లు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. అలాగే వాహనదారులు వేగంగా వెళ్లినప్పుడు ఏదైనా ఉన్నట్లుండి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఈ సమస్యకు సంబంధించి అధికారులు చర్యలు తీసుకోవాలని రోడ్డు ఇరుకుగా లేకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు. విద్యుత్తు శాఖకు అధికారులు డీఈ రాజగోపాల్, ఈఈ శ్రీనివాసరెడ్డిని 'ఆంధ్రజ్యోతి' సమస్యను తెలుపగా మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు.

సీఎం జగన్ వస్తున్నారని...

● రోడ్లకు మరమ్మతులు ● గుంతలు పూడ్చివేత ● ఎన్నోఏళ్లుగా మొరపెట్టుకున్నా... పనిచేయని అధికారులు

ఎర్రగుంట్ల, మార్చి 26: రోడ్లపై గుంతలు పడ్డాయి.. .రోడ్డుప్రమాదాలు జరుగుతున్నా...విలువైన ప్రాణాలు పోతున్నాయి...కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఎన్నోసార్లు ప్రజలు, ప్రచార సాధనాలు మొత్తుకున్నా పట్టించుకున్న పాపాన పోని అధికారులు బుధవారం జగన్ బస్సు యాత్ర వుందని ఆగమేఘాలపై రోడ్లపై ఉన్న గుంతలకు ప్యాచ్‌లు వేశారు. ముఖ్యంగా ఎర్రగుంట్ల-ప్రొద్దుటూరు రోడ్డు పేరుకే జాతీయ రహదారి కనీసం గుంతలను కూడా పూడ్చని అధికారులు నిర్లక్ష్యానికి ఇటీవలే ఎందరో బలైపోయారు. ప్రమాదాల బారినపడి వికలాంగులుగా మారారు. అయినా పట్టించుకున్న పాపాన పోలేదు అధికారులు. పెన్నాబ్రిడ్జిపై మోకాటి ఎత్తున రోడ్డుకు ఇరువైపులా మట్టి-రాళ్లు పేరుకుపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డాసరే ఉలుకూలేదు..పలుకూలేదు. వర్షాకాలంలో బురద బైకులపై వెళుతున్న ప్రయాణికులపై పడుతోందని మొత్తుకున్నా పట్టించుకున్న పాపానపోని ఈ అధికారులు జగన్ వస్తున్నారని అనుకున్నదే తడవుగా రిపేరీలు చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఎర్రగుంట్ల-ప్రొద్దుటూరు జాతీయ రహదారి చాలా ప్రమాదకరమైన రహదారిగా మారిపోయింది. రోడ్డుకిరువైపులా కంపచెట్లు, మట్టి, ఇతర వేస్టేజిని భారీగా వేసినా పట్టించుకోవడంలేదు. పెన్నాబ్రిడ్జి సమీపంలో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. ఇక్కడ అత్యంత డేంజర్‌జోన్‌గా మారిపోయింది. రోడ్డు అసలే ఇరుకుగా ఉండటం, ఇరువైపులా మట్టికుప్పలు వేశారు. దీనికి తోడు వాహనాల వేగం మరింత పెరిగి ప్రమాదాలకు దారితీస్తోంది. కేవలం ముఖ్యమంత్రులు, మంత్రులు, ఇతర వీవీఐపీలు వారు వచ్చినప్పుడు మాత్రమే కాకుండా ప్రజల ప్రాణాలును కూడా దృష్టిలో పెట్టుకుని రోడ్ల మరమ్మత్తులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

● జగన్ యాత్రలో భాగంగా బుధవారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో ఎర్రగుంట్లకు చేరుకుంటోందని అధికారులు వెల్లడించారు. ఇందులో భాగంగా పోలీసులు మంగళవారం సుమారు గంటపాటు రిహార్సల్ చేశారు. ముఖ్యమంత్రి కావడంతో భద్రతా ఏర్పాట్లు మరింత కట్టుదిట్టం చేస్తున్నారు. దీంతో ఇక్కడ


వైజంక్షన్‌లో రోడ్డుకు ప్యాచ్‌లు వేస్తున్న దృశ్యం

ట్రాఫిక్ ఆగిపోయింది. సుమారు 50మంది పోలీసులు, ఇతర అధికారులతో ఇక్కడ భద్రత కల్పిస్తున్నట్లు సమాచారం. ఆరునెలలుగా ఎర్రగుంట్లలో ట్రాఫిక్‌ను గాలికొదిలేసిన స్థానిక పోలీసు అధికారులు ముఖ్యమంత్రి వస్తున్నారని చేసిన హడావిడి అంతా ఇంతా కాదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.